


కెరటం ( సామాన్యుడి ఆయుధం ) న్యూస్

సోమవారం 25, మార్చి 2024 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ


# బీజేపీ అభ్యర్థిపై వీడిన ఉత్కంఠ

# తాండ్రకు పట్టం




- వీడిన ఉత్కంఠ..
- ఖమ్మం బీజేపీ అభ్యర్థిగా తాండ్ర
- హోరాహోరీ పోరులో సీటు దక్కించుకున్న వినోద్‌రావు
- బీజేపీ విధేయుడిగా పార్టీ పెద్దల్లో అత్యంత విశ్వాసం
- బీజేపీలో అనూహ్య పరిణామాలు, తాండ్ర అభిమానుల్లో హర్షం
- ఖమ్మంలో కమలం వికసిస్తుందన్న తాండ్ర
- కుగ్రామం నుండి అగ్రరాజ్యం వరకూ సాగిన తాండ్ర ప్రస్థానం..

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**



ఎట్టకేలకు బీజేపీ ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా ఎవరు పోటీచేయనున్నారనే అంశానికి తెరపడింది. దాదాపు నెలన్నరగా రగలిపోతున్న ఈ అంశానికి సంబంధించి అనేక ఊహా గానాలు, మరెన్నో వ్యూహాలు, రాజకీయ పరిశీలకులకు సైతం అందని అంచనాలతో బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును పార్టీ అధిష్టానం ఖరారుచేసింది. దాదాపు పదేండ్లకు పైగా కమలం పార్టీకి వీరవిధేయునిగా ఉంటూ వస్తున్న ప్రముఖ వ్యాపార వేత్త, డాక్టర్ రామానాయుడు ఏకలవ్య ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం మాజీ చైర్మన్, భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేట గ్రామస్తులు తాండ్ర వినోద్ రావుకే పార్టీ టిక్కెట్ కేటాయించిన బీజేపీ ఖమ్మంలో సంచలనం సృష్టించింది. వాస్తవానికి బీజేపీ తరపున ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావుతో పాటు చాలా మంది పోటీ పడ్డారు. అయినా పదేండ్లుగా బీజేపీ అనుబంధ సంఘాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ వస్తున్న బీజేపీ నేత తాండ్ర వినోద్‌రావును బరిలో దించాలని బీజేపీ పెద్దలు నిర్ణయించడం గమనార్హం. ఇటీవల బీజేపీలో చేరిన కొత్తగూడెం జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు జలగం వెంకటరావుకు దాదాపు టిక్కెట్ ఖరారైందన్న వార్తలు వచ్చాయి. అంతకు ముందు ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు, బీజేపీ నేత డా.గోంగూర వెంకటేశ్వర్లు(జీవీ), బీజేపీ నేతలు గల్లా సత్యనారాయణ, దేవకి వాసుదేవరావు, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఇలా అనేక మంది పేర్లు తెరమీదకు వచ్చాయి. రెండు రోజుల కింద ఏకంగా ఖమ్మం ప్రస్తుత ఎంపీ, బీఆర్ఎస్ నేత నామ నాగేశ్వరరావు బీజేపీలోకి వస్తున్నారన్న పుకార్లు షికారు చేశాయి. కానీ వాటన్నింటినీ పక్కన పెట్టి కమలం పార్టీలో కరుడు గట్టిన జాతీయ వాదిగా పేరున్న తాండ్ర వినోద్‌రావునే టికెట్ వరించింది. ఆదివారం సాయంత్రం బీజేపీ అధిష్టానం విడుదల చేసిన బీజేపీ అభ్యర్థుల జాబితాలో నెలన్నరగా ఉత్కంఠ రేపుతున్న అంశానికి తెరదించింది. దీంతో జలగం అనుచరుల్లో గందరగోళం నెలకొనగా, బీజేపీ నేత తాండ్ర అనుచరుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

## ఇదీ బీజేపీ నేత తాండ్ర ప్రస్థానం..

క్షామం, దుర్భిక్ష జాడ్యంలేని హరితలోకం నిన్నటి ఆయన స్వప్నం.. నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లా సబ్బండ వర్గాల ప్రజలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందేలా వ్యవసాయం, పరిశ్రమలతో ఈ ప్రాంతం పరిఢవిల్లాలన్నదే నేడు ఆయన ముందున్న ఏకైక లక్ష్యం. అందులో మొదటి స్వప్నం ఇసుక నేలల్లోనూ పసిడి పంటలు పండిరచ వచ్చున్న ఆశయం సంపూర్ణంగా నెరవేరింది. అందుకుగాను మెదక్ ప్రాంతంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ సాగుకు కొత్త నడకలు నేర్పి, ఆధునిక అన్నదాతగా, కేవీకే చైర్మన్‌గా అందరి నోటా ఘనకీర్తిని పొందారు. వ్యవసాయంలో మెళకువలను కర్షకులకు నేర్పి ఎందరినో ఉత్తమ రైతులుగా తీర్చి దిద్దిన ఆయన ఇన తనసొంత జిల్లాపై మమకారంతో తను పురుటిగడ్డవైపు అడుగులు వేశారు. తాను కాలు మోపిన ప్రతీ చోటా పచ్చదనంతో తులతూగిన పంటలను, తన ప్రాంతమైన ఖమ్మం జిల్లాలోనూ అదే తరహా ప్రత్యేకమైన వ్యవసాయాన్ని చేపట్టి ఈ ప్రాంత రైతులను వ్యవసాయం వైపు, యువతను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయాలన్న మంచి ఆశయంతో నడుంబిగించారు. ఇంతకూ ఆయన ఎవరు అనేగా మీ సందేహం.. ఆయనే ప్రముఖ పారిశ్రామిక వేత్త, డాక్టర్ రామానాయుడు ఏకలవ్య ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం మాజీ చైర్మన్, భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేట గ్రామస్తులు తాండ్ర వినోద్ రావు.

## కుగ్రామం నుండి అగ్రరాజ్యం వరకూ ప్రస్థానం..

తాండ్ర వినోద్ రావు ప్రస్థానాన్ని ఒక సారి పరిశీలిస్తే విస్తుగొలిపే అంశాలు వెలుగు చూస్తాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వారే. వినోద్ రావు తాండ్ర ప్రజాసేవకు, ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలకు అంకితమైన కుటుంబం నుంచి వచ్చారు. రాముడి సేవకు, హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడిన వంశం వారిది. వీరి స్వగ్రామం కొత్తగూడెం – భద్రాద్రి జిల్లా ముల్కలపల్లి మండలం తిమ్మంపేట. 1930లలో వినోద్ రావు తాత గారు సుదర్శన్ రావు భద్రాచలం రాములవారి ఆలయానికి ట్రస్టీ గా ఉండేవారు. ఆ హోదాలో ముత్యాల తలంబ్రాలు సమర్పించే వారు. వారు ఆ రోజుల్లోనే మున్షీ వరకు చదివారు. వినోద్ రావు గారి తండ్రి కృష్ణారావు గారు వకీల్ రావు గారి గా పాల్వంచ ప్రాంతంలోనే కాకుండా జిల్లాలో పేరు పొందారు. వీరి పెదనాన్న గారు టీ వీ నరసింహా రావు గారు జడ్జి గా పనిచేశారు. వినోద్ రావు ఇంటర్ వరకూ పాల్వంచలో చదువుకున్నారు. డబుల్ పోస్ట్ గ్రాడ్యుయేట్. అమెరికా లో మంచి ఉద్యోగం చేసినా, స్థిరపడడానికి మంచి అవకాశం ఉన్నా మాతృ భూమి మీద ప్రేమతో, ఇక్కడి ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో తిరిగివచ్చారు. ఒక సాధారణ గ్రామం నుండి మొదల్కెన ప్రస్థానం అగ్రరాజ్యంలోనూ తన కీర్తి ప్రతిష్టలు సంపాదించారు. వినోద్‌రావుకు సతీమణి, ఇద్దరు పిల్లలున్నారు.

## పల్లెలంటే పంచ ప్రాణాలు..

గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థ బాగుంటేనే దేశం కూడా బాగుంటుందని ప్రగాఢంగా విశ్వసించే తాండ్ర ప్రజలు పస్తులుండే దుస్థితి పోవాలని నిత్యం తపిస్తుంటారు. అందుకే ఆధునిక కర్షకునిగా డాక్టర్ రామానాయుడు ఏకలవ్య ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం చైర్మన్ గా కొన్నాళ్ల పాటు పనిచేసి అనేక మంది వ్యవసాయ శాస్త్రవేత్తలను రప్పించి సాంప్రదాయ సాగు స్థానంలో ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. అందుకే ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేస్తూ ప్రణాళిక బద్ధంగా సాగును సరికొత్త పుంతలు తొక్కించి ఔరా అనిపించారు. దీంతో పాటు వినోద్ రావు గత దశాబ్దానికి పైగా సోషల్ వర్కర్ గా పలు స్వచ్ఛంద సంస్థ లలో ఉన్నత బాధ్యతలు సమర్థంగా నిర్వహించి పేదలకు సేవ చేశారు. ఆయన రియల్ ఎస్టేట్ రంగంలో ఉంటూనే 2015 నుంచి 2021 వరకూ ఏకలవ్య ఫౌండేషన్ తరఫున విద్య, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయం వంటి రంగాల్లో సేవలందించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక గ్రామాల్లో వారి నాయకత్వంలోని ఫౌండేషన్ అద్భుతమైన సేవ చేసింది. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా లో గిరిజనుల అభ్యున్నతి కోసం చేసిన కృషి పలువురి ప్రసంశలు అందుకుంది. ప్రత్యేక విద్యా కార్యక్రమం ద్వారా రెండు రాష్ట్రాల్లో 24 జిల్లాల్లో బడుగు, బలహీన, నిరుపేద కుటుంబాలకు సేవ చేస్తున్నారు. డాక్టర్ రామానాయుడు ఏకలవ్య ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం చైర్మన్ గా 2017 నుంచి జనవరి 2024 ఆయన అందించిన అద్భుత సేవలు ప్రశంసలు అందుకున్నాయి. ముప్పేట దాడికి గురవుతున్న హిందూ సమాజ సేవకు వీరు నడుం బిగించారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి పథంలో దూసుకు పోవడంతో స్ఫూర్తి పొంది, ఈ మహా క్రతువులో తన వంతు పాత్ర పోషించేందుకు, ప్రత్యక్ష రాజకీయాల ద్వారా ప్రజా సేవ కొనసాగించేందుకు ఉత్సుకతతో ఉన్నారు.